# పులిగోరు

- కర్లపాలెం హనుమంతరావు

**అదంత పెద్ద పట్టణమూ కాదు, అట్లాగని మరీ చిన్న పల్లే కాదు. అర్ధరాత్రి తర్వాతయినా సద్దుమణిగేపాటి ఒక మాదిరి వూరు.**

రాత్రి బాగా పొద్దుపోయింది. డిసెంబరాఖరి చలి. పొగమంచు దుప్పటి కప్పేసుకుని వీధి దీపాల మసక వెల్తురు క్రింద నిద్రకు పడుంది వూరు.

టౌనుకా కొసనున్న ట్రావెలర్స్ బంగళా, ఈ కొసనున్న యానాది గూడెం మాత్రం ఇంకా మేలుకొనే వున్నాయి.

వుత్తప్పుడు ట్రావెలర్స్ బంగళా నిశ్శబ్దంగా, నిర్మానుష్యంగా కేంపుకెళ్లిన మొగుడు కొంపకెపుడొస్తాడా అని ఎదురుతెన్నులు కాసే ఇల్లాలి లాగున్నా, వి.ఐ.పి. ఎవరైనా విడిది కొచ్చినపుడు మాత్రం శోభనం పెళ్లి కూతురిలా శృంగారించుకుంటుంది. అదాపూట అట్లాగే ఝిగేల్ ఝిగేల్ మని మెరిసి పోతోంది. విడిదికి దిగిన వి.ఐ.పి మరి సాక్షాత్తూ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు గారు!

ఎంత ఈ.ఈ అయినా ఒక్కోసారిట్లాంటి ఆఫ్‌ట్రాల్ టౌన్ టి.బి.లో సైతం చలి రాత్రులను గడపక తప్పదు. మరి డ్యూటీ. అదీగాక ప్రెసిడెంటు గారు ఈఈ గారిమీదున్న అపారమైన అవ్యాజానురాగాల వల్ల కనీసం ఒక్ఖ్ నైటన్నా సతీ సమేతంగా తామిచ్చే ఆతిథ్యమందుకొని తరింపచేయుమని అర్జీ పెట్టుకోవటం - లోపాయికారీగా అదీ ఇంకో కారణం.

ఏమైతేనేం, భక్తుడి మొర ఆలకించి పూజలందుకోవటానికి ప్రత్యక్షమైన భగవంతుడిలాగా శ్రీవారాపూట ఆ వూర్లో ఆగిపోయి వూరినీ, టీ.బీ.ని కూడా పరమపావనం చేస్తున్నారు. అందుకు తార్కాణం ... అదిగో ... అర్ధరాత్రి దాటినా మూసున్న గదిలో నుండి ముద్దముద్దగా ఆ ముద్దుమాటలూ, మెత్త మెత్తగా మత్తు నవ్వులూ... ఆపైన వుండుండి అలలు అలలుగా చెలరేగే గాజుల రవళులు వగైరా... వగైరా...

బైట వరండాలో పచార్లు చేస్తున్న ప్రెసిడెంటు గారి గుండెల్ని 'ఢీ' కొట్టుకుంటూ... పొంగి వస్తున్నాయి.

అసహనంగా వాచీ చూసుకొన్నాడాయన. పన్నెండూ నలభై దగ్గర ఆగిపోయి వుంది. టైమెంతయిందో తెలీదు. బంగళాలో నర పురుగు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసాడాయన.

''దొంగలమ్మి కొడుకులింకా రాలేదేమిటి?'

విసురుగా మరో సిగరెట్టంటించుకుని అంతకన్నా విసురుగా మళ్లీ పచార్ల కార్యక్రమం మొదలు పెట్టాడాయన.

ప్రెసిడెంటు తిట్టిన లమ్డికొడుకులు ... గుమాస్తా ప్రసాదరావూ, అతగాడర్జంటుగా తేవాల్సిన నమ్మకమైన పాకీవాడు.

అర్ధరాత్రిపూట ప్రెసిడెంట్ గారికి టి.బి. దగ్గర నమ్మకమైన పాకీవాడితో పనేంటో!

ఆ అనుమానం ప్రసాదరావుకీ వచ్చింది. మధ్యరాత్రి మంచి మూడ్‌లో వుండంగా ప్రెసిడెంటు స్వయంగా తలుపుతట్టి 'అరిజెంటుగా పాకీ యెదవొకడు కావాలి ... నమ్మకమైనోడు ... గుట్టు చప్పుడు కాకుండా టీ.బీ. కాడికి కొట్టుకురా' అని ఆర్డరేసాడు.

అధికారికంగా అనుమానం నివృత్తి చేసుకునే ధైర్యం లేదా గుమాస్తాకు, నిద్ర కళ్లతో రోడ్డుమీద కొచ్చి పడ్డాడు.

చెవుల చుట్టూ మఫ్లర్ చుట్టుకున్నా గుండెల్లో నుండి చలి తెర తెరలుగా తన్నుకొస్తోంది. ఛత్! వెధవ బ్రతుకు... అని కాండ్రించి వుమ్మేసుకుని చుట్టంటించి కాలు సాగదీసుకున్నాడు ప్రసాదరావు.

ఎక్కడి వూరు! ఎక్కడి యానాది గూడెం! వడిసెలరాయి విసిరేసినట్లు ఎక్కడో మైలున్నర దూరం. పాచి చెరువు పక్కన డొంకల్లో బడి పావుగంట పాటు ఎన్ని రొచ్చులు కసాపిసా తొక్కుకుంటూ పోతే వచ్చిందీ... ఢండాలం!

ఢండాలమే మరి. పందులు పొర్లాడే బురద గుంటల దుర్గంధం ఫర్లాంగు దూరాన్నుండే ముక్కులు బద్దలు కొట్టేస్తుంది.

నేలతల్లి కుష్టు కురుపుల్లా గుడిసెలు. అవి స్రవించే లావాలాంటి రసిక లాగా మురుక్కాలవలు. వాటిల్లో పడి పొర్లాడే పందులూ, కుక్కలూ, మనిషి పిల్లలూ, దోమల్లా ... ఈగల్లా ... పురుగుల్లా ... నానా బీభత్సంగానూ, భయానకంగానూ వుంది యానాదిగూడెం.

తాంబేటి చిప్పల్లా, మట్టి కుప్పల్లా చీకట్లో నిశ్శబ్దంగా, నిస్తేజంగా పడున్న గుడిసెల గుండెల్లోని గుడ్డిదీపాలు వెలుగిద్దామా, వద్దా అనే ఆస్తి నాస్తి విచికిత్సలో పడి కొట్టుకుంటున్నాయి.

ఎక్కడో తాత బాగా తాగి ఏక్‌తారా మీద కర్ణకఠోరంగా ఏడుస్తున్నాడు. ఇంకెక్కడో పసిబిడ్డ పాల కోసం కాబోలు కక్కటిల్లి పోతోంది. ఎందుకో ఓ మొగుడు పెళ్లాన్ని బండబూతులు తిడుతూ గుండెల మీద గుద్దుతున్నాడు. ఇవేవీ పట్టనట్లు కొంత మంది వేదాంతుల్లాగా ఓ మూల చేరి గంజాయి సేవలో మునిగి తేల్తున్నారు.

గుడిసెల్లో చోటులేక బైట మురుక్కాలవల ప్రక్కన చేరిన జంటలు వంటి మంటలతో చలి కాచుకోవటానికి తంటాలు పడుతున్నాయి.

తూర్పున తెల్లారకముందే చీపుర్లు పట్టుకుని వీధులు వూడ్చే వీళ్ల గూడెం మురికిమయం.

ఎందరి ఇళ్ళల్లోనో పాయిఖానాలను పరిశుభ్రంగా వుంచే వీళ్ల ఇళ్లు పాయిఖానాలు.


చచ్చి, కుళ్లి, కంపుకొట్టే ఎలుకల్నీ, కుక్కల్నీ, దిక్కూ మొక్కూ లేని మానవ కళేబరాల్నీ భూస్థాపితం చేసే వీళ్లు చావకపోయినా కుళ్లు కంపుగొడుతున్న శవాలు.

నవనాగరికతకు సింబల్స్ ... రోడ్‌సైడ్ కెనాల్స్ ... వాటిల్లో అడ్డుపడే చెత్తా చెదారాన్ని తొలగించే వీళ్ల చీపుళ్లు తమ బ్రతుక్కాలవల కట్టబడ్డ దరిద్రాన్నీ, దుఃఖాన్నీ, రోగాల్నీ, అజ్ఞానాన్నీ మాత్రం తొలగించలేక పోతున్నాయి. ఉషోదయంతోనే వూరిని అద్దంలా కడిగిన గిన్నెల్లా తళ తళలాడించే ఈ పాకీవాళ్ల బ్రతుకులో! కళాయి వెలిసి గీతలు పడ్డ గాజు ముక్కలు... సిలుంపట్టి సొట్టపోయిన చిల్లు గిన్నెలు...!

చీకట్లో ఏమంటుకుందో చెప్పుకాలు బరువుగా వుంది ప్రసాదరావుకి. అసహ్యంతో వళ్లు జలదరించింది. కాళ్లు ఝాడించుకోవటంతో తూలి పక్కనే మురిక్కాలవలో పడి దొర్లుతున్న పందిపిల్ల మీద పాదం పడింది.

ఆదమరిచి నిద్రపోతున్న ఆ ఆకారం బెదిరి


BHASKAR




వెయ్యిన్నొక్కరాగం ఒక్కే సారందుకుంది, అది పందిపిల్ల కాదు... మనిషి పిల్లే... నల్లగా... పుల్ల లాగా... దిగంబరంగా అచ్చు పంది పిల్లలాగే వుంది. ఆ గోలకి గుడిసెలో నుండి బైటికొచ్చిన మరో ఆకారం బండబూతులందుకుంది. అది ఒరియా భాష.

అర్థంకాక చిత్తరువులా నిలబడిపోయాడు ప్రసాదరావు.

''ఎవుడదీ ... అట్టా దిట్టి బొమ్మలాగా నిల బడ్డాడూ!''

''నేనేరా! ప్రసాదరావుని''

'పెసాదరావంటే ఎవుడసే'

వాడు ఫుల్ డోసులో వున్నాడని తెలుస్తూనే వుంది. నెల నెలా వేలి ముద్ర లేయించుకుని జీతా లిచ్చే గుమాస్తా తెలీకపోవడమేమిటీ?

గొంతు గుర్తు పట్టి వెన్గా నిలబడ్డ ఆడమనిషి ముందుకు పరిగెత్తుకొచ్చింది. 'తవురా బాబూ! ఏటీయాలప్పుడు ఒచ్చేసినారు? కాకితో కబురంపితే మేమొచ్చీసినాం కాదా!'

'కబురెట్టటానికి కాకులు దొరకలేదు కానీ... పుల్లిగాడెక్కడే వుండేదీ?'

'పుల్లిగాడండే.. ఈయేలే మనువయింది ... ఆడే గదే ... కొత్త పెళ్లికొడుకు ... పాకీ పనికి ఆడెం దుకు బాబూ! నేనొలిపొచ్చేత్తాను.. పాకీదొడ్డి తోడా లేంటి బాబయ్యా!' అనడిగాడు ఇందాకటివాడు.

లెట్రిన్ క్రింద బాది మలంతో నిండిపోతే దాన్ని తోడేందుకు అందరూ నిద్రపోయే రాత్రివేళే పాకీ వాడు పనిలోకి దిగుతాడు.

మెడదాకా మలంలో కూరుకుపోయి చేతుల్తో ఎత్తిపోస్తే వందో రెండొందలో ఇస్తారు. అందులో సగం మందుకే సరిపోతుంది.

'తాగుబోతు సచ్చినోడివి. నువ్వెందుకురా.. పోయి పుల్లిగాడిని పట్టుకురా!'

పుల్లిగాడి కోసం ఆడది పరిగెత్తింది. మగాడు ఏడుస్తున్న పసికూనకు మళ్లీ రెండంటించి గుడిసె లో దూరిపోయాడు ఏదో గొణుక్కుంటూ.

'నమ్మకమైనోడు కావాలన్నాడు ప్రెసిడెంట్. ఎక్కడ నుండొస్తది నమ్మకం! ఇదేమన్నా పంచదార, కిర్సనాయిల్లాగా బ్లేకులో దొరికే సరుకా, రెండు రూపాయలెక్కువ పారేసి తెచ్చేసుకోటానికి ఎవడు ఎవణ్ణి నమ్మగలడీ కలికాలంలో!

కుళ్లు కన్నా పుచ్చు మేలు ... వున్న వాళ్లల్లో ఈ పుల్లిగాడే నయం. మాటపోదు అనుకున్నాడు ప్రసాదరావు.

వాడికివాళే మనువయింది వస్తాడా ... రాడా!.. స్వయంగా తనే వచ్చి పిలిచిన తర్వాత రాకుండా వుండటానికి ఎన్ని గుండెలు!

పొద్దున అడ్వాన్సు డబ్బులు కూడా ఇచ్చాడు పెళ్లి ఖర్చులకి. వాళ్లల్లో వింత ఆచారముంది. దేశ మంతా వరకట్నాల సమస్యతో వేగిపోతుంటే, వీళ్లలో ఇంకా 'కన్యాశుల్కం' ఆచారంగా వస్తుంది! దాన్నే వాళ్లు 'ఓలీ' అంటారు. పెళ్లికొడుకు, పెళ్లి కూతురు తరుపువాళ్లకి సుంకమిచ్చి, పెళ్లి ఖర్చులో మూడొంతులు భరించాలి. అదీ ఆచారం.

'ఓలి ఎంతరా?' అనడిగాడు ప్రసాదరావు ప్రొద్దున.

'పదేను రూకలండి బాబయ్యా!' అన్నాడు వాడు.

'దాంతో ఒక్క రవిక ముక్కన్న వస్తుందా!' అని ఎగతాళిగా నవ్వుతున్న ప్రసాదరావుకి ఒక కథ చెప్పాడు పుల్లిగాడు.

రామాయణ కాలంలో మాకులపోడు ఒకడు పెళ్లి కాయం సేసుకుని కర్సుల కోసం రాములోరి కాడికెల్తే ఆ దరమ పెబువు బుట్టెడు రూకలు దానం సేసినాడంట. ఈ యెదవ సచ్చినోడు ఉసారు పట్ట లేక తెల్లార్లూ సీసాల మీద సీసాలు లాగించేసి నాడంట. తెల్లారితే బుట్టలో ఇంక పదేను రూకలే ఉన్నాయి బాబయ్యా! ఏడుసుకుంటూ అదే ఓలిగా ఇచ్చి మనవు సేసుకున్నాడని మా పెద్దోల్లు చెబతా వుంటారు. అదిగో... అప్పటి కాణ్ణించీ అదే మాకు ఆసారమైపోయింది'

'ఐనా మీరంతగా తాగి చావకపోతే ఏం పోయిం దిరా?'

'రేయింబవళ్లు మలమూత్రాల మజ్జన వూపిరి తీసేవాళ్లం ... మందు నిసా లేకపోతే బతగ్గలమా' పుల్లిగాడంతే. ఏదో విధంగా సమర్థించుకొంటాడు ... తననీ, తనవాళ్లనీ ... అదీ వాళ్ల కట్టుబాటు! .. అట్లాంటి కట్టుబాటు లేకనే తమ కులం వాళ్ళు ఇట్లా వెనకబడిపోయారు. వట్టి పేరుకే ముందు తరగతి వాళ్లు. వాస్తవానికి రెండు వేళ్లూ సజావుగా నోట్లోకి పోయేవాళ్ళు తమ కులంలో మాత్రం ఎంత మందున్నారు! భేషజం మాత్రం జాస్తి. 'మింగ మెతుకులేదు మీసాలకు సంపెంగనూనె' అంటారు దీనినే! అనుకున్నాడు ప్రసాదరావు. పుల్లిగాడంటే ప్రసాదరావుకి ప్రత్యేకాభిమానం వుంది. ఇంటి చాకిరీ చేసి పెడతాడు విశ్వాసంగా పంచాయితీ పని అయిపోయిన తరువాత.

'ఏంటి బాబూ పని...!' అనడిగాడు బుర్ర గోక్కుంటూ వచ్చిన పుల్లిగాడు.

'చెబుతాగానీ ... నా వెంటరా!' అని బయలు దేరాడు ప్రసాదరావు.

'ఇప్పుడా!' అని తటపటాయించి 'సరే పదండి ... తవరి మాటెందుకు కాదనాల' అని నమ్మిన బంటులాగా వెంటే బైలుదేరాడు పుల్లిగాడు.

'బాబూ! పులిగోరు ఎంతుందంటారు!'

'ఏంరోయ్! పులిగోరు మీద మనసుపో యింది' అని నవ్వాడు ప్రసాదరావు.

'మరేంలేదు సామీ! మా ఆడది... అదేనండీ.. ఇయాల నేను మనువాడిన పిల్లదానికి పొద్దుటేల నుండి పిచ్చి పట్టి పోనాదండీ... పెసిడెంటు బాబు గోరి ఆడోల్ల మెళ్లో పులిగోరు సూసినాదంటండి. అట్టాంటిది కావాల నాకూ ... అని అలిగి కూకున్న దండి... అప్పుడే ... తిక్కముండ'

'పోనీ... చేయించేసెయ్యరాదుట్రో' అని నవ్వాడు ప్రసాదరావు.

'తవరికట్టాగే నవ్వుతాలుగా వుంటది బాబయ్యా! రోజా రెండు పూటలా కంచంలోకి కూడెలితేనే గొప్ప. ఏడ నుంచి తేను పులిగోరు కరుసు?'

'పెద్దాయన ఏదో ముఖ్యమైన పని వుండే నిన్ను ప్రత్యేకంగా పిలిపిస్తున్నార్రా! పెద్ద మనుషులతో వ్యవహారం... బంగళాలో వుంది మీ కులపోడే గదా! బాగానే ముడుతుందేమోలే!'


'అంతా బాబుల సలవ... మాకులపోడైనా అంత పెద్ద దొర అయినాడు. అదేసాలు' అని పొంగిపోయినాడు పుల్లిగాడు.

'ఇప్పుడంటే మా బతుకులు ఇట్టాగైనయ్ గానీండి బాబయ్యా, మా ముత్తాత నైజాంలో ఒక ఎలుగెలిగినాడండీ. రెండంతస్తుల డాబా... ఆడోల్ల వంటినిండా బంగారం... అట్టాసాగింది యవ్వారం'

'మా తాతలు నేతులు తాగారు. మా మూతులు వాసన చూడండీ అన్నాట్ట వెనకటికి నీలాంటి వెధవే ఒకడు'.

'అట్టాగని కాదూగానండి సామీ! సత్తె పెమానకంగా ఇది జరిగిన ఇసయమేనండీ.. మా ముత్తాతలది అస్సలు ఒరిస్సా దేశమండి. ఆడ కరువు కాటకాలొచ్చి తిండిలేక సచ్చిపోతావుంటే నైజాం పెబువులు పిలిపించుకొన్నారయ్యా. రెల్లికులపోల్లు శానామంది పిల్లా జెల్లాతో నైజామొచ్చేసినారు. 'పీతులెత్తండి-ముద్ద దొరుకుద్ది' అన్నారు పెబువులు. తప్పేదేవుంది? కూటికోసం ఏ కక్కుర్తి అయినా పడక తప్పదు. అప్పటి నుంచీ రెల్లికులపోల్లకి పాకీపని కాయమైపోయింది. ఇప్పుడంటే ఆళ్లూ ఈళ్లూ కల్సిపోనారు గానీ ఒకప్పుడంతా రెల్లి సజ్జే.

మా ముత్తాతొకడు నిజాంరాజు కాడ పాకీపని సేసేవాడయ్యా. ఆడికి రోజా పెబువుల వారి మల ఇసర్జనలో ఏదో తలతల మెరుత్తా అగుపడిదంటండీ! వున్నోడి మలమట్టాగే వుంటుందని ఎంత సరిపెట్టుకున్నా మనస్సు నిలవక ఒకరోజు డైరెక్టుగా ఆ మారాజునే అడిగేసినాడంట! దానికా దరమపెబువు 'ఆయుస్సుకోసం నిత్తెం నేను బోయినంలో బంగారు రేకులేసుకు తింటా యెదవా! అయే... ఇయి. కావాలంటే తీసుకుపోతుండు' అనేసినాడంట. మా తాత అట్టా సంపాదించిందంతా కూడబెట్టి పెద్ద మేడ కట్టి గోపురం కాడ చీపురు ఏల్లాడగట్టినాడంట. మరి కూడు బెట్టిన చీపుర్నీ, వురుత్తినీ కూడా వదలకుండా వత్తూనే వున్నారయ్యా ఆల్లంతా... మజ్జెలో మా మిడిమేలపుతాతొకడు వున్నదంతా తాగుడికీ, సెన్నపట్నంలో గుర్రాలకీ, ముండలకీ కైంకర్యం సేసేసినాడండి. మళ్లీ మేమిట్టా సీపురు కట్టలతో మిగిలిపోయినాం...'




పుల్లిగాణ్ణి కదిలిస్తే అట్లాంటి కథలెన్నైనా చెప్తాడు.

మాటల్లోపడి కాలెంత దూరం సాగిందో తెలీదు గానీ ఎదురుగా టీ.బీ. కాంపౌండు గేటు మీది కోడిగుడ్డు దీపం సానిదాని కులుకులాగా, ఎలక్షన్స్ ముందు వేదికెక్కిన రాజకీయ నాయకుడి నమస్కారపు నవ్వులాగా వెలిగిపోతోంది.

'అదిగోరా బాబూ... వచ్చేసింది.. తెల్లార్లూ జాగారమై పోయిందివాళ. శివరాత్రైతే పుణ్యమైనా దక్కేది. ఐనా ఎక్కడి వూరు! ఎక్కడి గూడెంరా నాయనా!'

'మరి మురికి ఎదవలం గద బాబయ్యా! పోనీ కొత్తగా మా కోసం కట్టించే కాలనీ అన్నా కూసింత దగ్గరగా కట్టింపిత్తన్నారు కాదు. తవరిట్టా అరద రాత్రుల్లు ... అపరాత్రుల్లు పాదయాత్తర్లు సెయ్యకుండా వరండాలో నిలబడి 'ఓ పిల్లిగా' అని అట్టా కేకేస్తే, అయ్యా! అంటూ ఆజిరీ అయిపోతాను గదా!'

'ఏడిశావ్‌లేరా వెధవ తెలివి. పెరటి మధ్యలో ఎవడన్నా తులసీ మొక్క పెట్టుకొంటాడు గానీ పాకీ దొడ్డి కట్టుకుంటాడా!'

'మా బాగా సెప్పేసినారు. మరయితే తెల్లారి లేవంగానే తులసి మొక్క కన్నా ముందుగా మరుగుదొడ్డే దరిశనం సేసుకోవాల మళ్లీ'


'అందుకని పాయిఖానా నట్టింట్లో వుండాలంటావుట్రా?'

'బస్తీల్లో ఇల్లట్టాగా వుంటుందంటగా బాబూ! మా బామ్మర్ది సెప్పినాడు. ఆడక్కడ మునిసిపాలిటీలో పనిసేత్తా వున్నాడు. మాకన్నా యాబై రూకలెక్కువే ఇత్తున్నారయ్యా. మావే ఎట్టిశాకిరీ బతుకులయి పోనాయాడ. తమరింకా శానా నయం బాబూ! మా బుల్లిగాడి పంచాయితీలోనైతే మరీ యెనబై రూకలు బిగసట్టుకుని పైని రెండొందలు మాత్తరం ఇత్తున్నారంట. తెల్లారి లేచింది మొదలు పెసిడెంటు కాళ్లొంచీ, గుమాత్తాగోరి దాకా ఇంటి పన్లు సెప్పేవారేనంట. అందుకనే బాబూ, పోయిన వారం ఆల్లంతా వంటిమీద మలం పూసుకుని వూరంతా వూరేగినారు. శానా అల్లరయిపోనాదండి బాబూ!'

'తెలుసు గానీ... నువ్వు మాత్రం ఇట్లాంటి గొడవల్లో దిగబాకరా పుల్లిగా. మన ప్రెసిడెంటుగారి సంగతి తెలుసుగా. చేతిలో ముద్ద చేజేతులా పారేసుకున్నట్లవుతుంది. బస్తీ కథలు వేరు'

'నాకు తెలవదా బాబూ! బస్తీలోనంటే పెరట్లో తులసి మొక్క యేసుకునేందుకు జాగానే వుండదు. ఈడట్టా కాదుగా ... మొన్నోపారి జరిగింది ఇన్నారా! అంజిల్సా గారి దొడ్లో తులసిమొక్క ఎక్కి రావడం లేదని పిల్లలు పీకి పాయిఖానాలో ఏసినారట. ఆడ దానికి ఎరువు గిరవు దిట్టంగా పడింది కామోసు ఏపుగా పెరిగిందయ్యా'

పుల్లిగాడు పడీ పడీ నవ్వుతుంటే ప్రసాదరావుకి మేనల్లుడు గుర్తుకొచ్చి నిట్టూర్చాడు. బియ్యే చదివినా ఉద్యోగం రాక చేసేందుకింకే పనీ చేతగాక రికమెండేషన్ మీద బందరు మున్సిపాలిటీలో పుల్లిగాడి




లాంటి వాళ్లమీద అజమాయిషీ ఉద్యోగం చేస్తున్నాడు. వాడి తండ్రి పరమ శ్రోత్రీయుడు.

'మరే రకంగా వీళ్లందరూ ముందు పడిన తరగతి వాళ్లవుతారో! కులాన్ని బట్టి విభజన యేంటీ! కూటికిలేని వాళ్లు అన్ని కులాల్లోనూ వున్నారు. నిజానికి వీళ్లందరిదీ ఒక తరగతి. ఈ సంగతి అందరికీ తెలిసిందే. రాజకీయాల కోసం నాటకమాడుతున్నారంతే..' అనుకున్నాడు ప్రసాదరావు.

'అన్నాయం బాబయ్యా! సదూకున్న వాళ్లు, పెద్ద కులపోళ్లు ఈడ కూడా మాతో పోటీకొచ్చి మానోటికాడి కూడు లాగేత్తా వున్నారు' అన్నాడు పుల్లిగాడు.

'మీ పని చేయటం లేదులేరా, బొత్తిగా. ఏదో పైపైన చూస్తుంటాడు. వీధుల్లో మురుక్కాలువలూ అవీ సరిగ్గా శుభ్రం చేయించటం అట్లాంటి వేలే.'

'సూసారా బాబూ! మళ్లీ పచ్చపాతం ... అట్లాంటి పనే సేయటానికి అంతే జీతం తీసుకుంటావుండి కూడా... కులానికి కెక్కువని మరి మాసేతుగా పెంటకుప్ప లెత్తేయించటం లేదు...' అని నవ్వాడు పుల్లిగాడు.

ప్రసాదరావుకేం జవాబు చెప్పాలో తోచక చిరాకు పడ్డాడు.

'వూసులు మొదలు పెడితే నీకింక వళ్లు తెలవదు కానీ... అవతల పెద్దాళ్లతో పని... ప్రెసిడెంటు గారీ పాటికి నిప్పులు తొక్కిన కోతిలాగా గెంతుతుంటారు. నువ్ ముందు పరిగెత్తి పోరా.. వెనకనే నేనొస్తాను. అన్నట్లు మళ్లీ చెప్పక్కర్లేదుగా..' అని చేతులు నలుపుతూ చూపించాడు నవ్వుతూ.

'నాకు తెలవదంటండీ పెసాదరావు బాబుగోరూ! తమరి సలవవల్లే గదా నాకీయేల బెమ్మాండమైన బేరం తగిలింది.' అని దండంబెట్టి బంగళా వైపు పరుగందుకున్నాడు పుల్లిగాడు. ప్రసాదరావు మెల్లిగా నడిచివెళ్లే సరికి బేరం సెటిలయినట్లుంది. పుల్లిగాడు వి.ఐ.పి. గదికి అటాచ్‌డ్‌గా వున్న లేవెట్రీలో పనిచేస్తున్నాడు.

ప్రసాదరావు ముందుకు కదలబోతే ప్రెసిడెంటు చిర్నవ్వుతో చెయ్యడ్డం పెట్టి లౌక్యంగా 'ఆ యెదవ నమ్మకమైనోడేనంటావా?' అనడిగాడు.

అవునన్నట్లు తలూపాడు ప్రసాదరావు.

'చాలా పొద్దుపోయింది తెల్లారి మళ్లీ డ్యూటీలోకి పోవాలిగా. ఇహపోయి పడుకో' అనేటప్పటికి ప్రసాదరావుకి వెనక్కి తిరక్క తప్పింది కాదు.

నడచి ఇంటికి వెళుతున్న ప్రసాదరావు పెదాల మీద చిత్రమైన చిరునవ్వు మొలిచింది. 'ప్రెసిడెంటు నా దగ్గర సీక్రెట్లు దాద్దామనుకుంటున్నాడు. పుల్లిగాడి సంగతి నాకన్నా ఆయన కెక్కువ తెల్సా?'

తెల్లారి పుల్లిగాడు పన్లో కొచ్చినప్పుడు ప్రసాదరావు పక్కకు పిల్చి చెయి చాపాడు. ఇరవై రూపాయలు చేతిలో పెట్టాడు పుల్లిగాడు.

'ఇదేంటిరా! యేసాలేస్తున్నావా' అని గదమాయించాడు ప్రసాదరావు.

'తమరికాడ నాకు యేసాలేంటయ్యా! పెద్దాయన కదా వందో రెండొందలో ఇత్తాడనుకున్నా. యాబయి రూపాయలు సేతుల్లో పెట్టి పొమ్మన్నారు బాబూ! పైనింకా వారునింగూ...'

'వార్నింగేంట్రా?'

'ఈడ జరిగిన యవ్వారం ఈడనే మరిసిపోవాల. బైటెక్కడన్నా పొంగావో ఉద్దోగం వూడుద్ది ... పేనాలు కూడా దక్కవు అన్నాడండి పెసెెంటు బాబు. తవరు నామీద దయతలిసి ఇంక తరిసి తరిసి అడక్కండి బాబయ్యా!' అని రెండు చేతులూ ఎత్తి దండం పెట్టేడు పుల్లిగాడు.

'నీ పెళ్లానికి అంతా సెప్పేసావంటరా?'

'ఉసారులో ఏదో కూసానండీ' అని బుర్ర గోక్కున్నాడు పుల్లిగాడు'

'ఇహనేం' అని జాలిగా చూశాడు ప్రసాదరావు పుల్లిగాడి వంక.

తరువాత మూడు రోజులకు వూరవతల పాడుబడ్డ బావిలో శవంలా తేలాడు పుల్లిగాడు!

పుల్లిగాడి పెళ్లానికి పిచ్చి పట్టింది. 'పులిగోరు ... పులిగోరు' అనుకుంటూ ఏడ్చుకుంటూ, నవ్వుకుంటూ రోడ్లంబడి తిరుగుతోంది.

పుల్లిగాడి నెవరు చంపించారో తెలుసుగానీ, ఎందుకు చంపించారో తెలీక మల్లగుల్లాలు పడ్డాడు ప్రసాదరావు.

హరిజన కాలనీ కాంట్రాక్ట్ ప్రెసిడెంటు గారి బావమరిది కొచ్చింది.

మరో ఆరు నెలలకు వూరిబైట సినిమా హాలు వెలిసింది. అదీ ప్రెసిడెంటు గారి బావమరిది పేరు మీదే. సినిమా హాలు ఓపెనింగ్‌కు వచ్చింది మళ్లీ ఈఈ గారే. ఈసారి బంగళాలో రిస్కు తీసుకోదల్చుకోలేదు లాగుంది ఏకంగా ఇంట్లోనే ఆతిథ్యమిచ్చారు ప్రెసిడెంటుగారు సతీసమేతంగా.

ఏర్పాట్లన్నీ పూర్తిచేసి పన్నెండు గంటలకి ఇంటిదారి పట్టిన ప్రసాదరావు కళ్లకి ఝిగేల్ మని మెరుపు కొట్టినట్లయింది. ప్రెసిడెంటు గారి భార్య మెళ్లో మళ్లీ ఆ 'పులిగోరు'! ఇంతకాలం వేయలేదు. ఇవాళే మళ్లీ వేసుకుంది! బైట వరండాలో నిండా మత్తులో మునిగి వున్న ప్రెసిడెంటు గొణుక్కుంటున్నాడు. 'ఆ ఈఈ గాడికి ఈ పులిగోరు పిచ్చేంటో ... మదపిచ్చి'

'ఈ పులిగోరు కోసమే కామోసు ఆరోజు పుల్లిగాడిని బంగళాకు పిలిపించింది. బంగళా లేవెట్రీలో జారి పడితే రాత్రంతా తోడించారు పుల్లిగాడిచేత. ఆడికి ఈళ్ల గుట్టు తెలిసిందని మట్టుపెట్టారు' అని నిట్టూర్చుకున్నాడు ప్రసాదరావు.

'నోరు తెరిస్తే తన గతీ అంతే' అనుకున్నాడాయన.